

ప్రేమజంట బలవన్మరణం

ఇష్టం లేని పెళ్లి చేస్తున్నారన్న కారణంతో యువజంట పురుగులమందు తాగి ఆత్మహత్య చేసుకున్న ఘటన మార్కాపురం మండలంలో జరిగింది.

- 8లో..



టీడీపీ భోషాణం ఖాళీ

యర్రగొండపాలెంలో టీడీపీ పరిస్థితి రోజురోజుకూ క్షీణిస్తోంది. గత ఎన్నికల్లో టీడీపీ తరఫున పోటీచేసిన అజితారావు ఆ పార్టీని వీడారు.

- 8లో..

గరిష్టం/కనిష్టం
41/28

వాతావరణం

పగటి ఉష్ణోగ్రతలు పెరుగుతాయి. వాతావరణం ఉక్కపోతగా ఉంటుంది. వేడిగాలులు వీస్తాయి.

పచ్చమూకల బరితెగింపు..



జిల్లాలో టీడీపీ నేతలు, కార్యకర్తలు బరితెగించారు. ఓటమి భయంతో పచ్చమూకలు అధికార పార్టీ నేతలు, కార్యకర్తలపై దాడులకు తెగబడుతున్నాయి. పార్టీ అధ్యక్షుడు చంద్రబాబు అసహనంతో పార్టీ కేడర్‌ను రెచ్చగొట్టేలా చేస్తున్న ప్రసంగాలకు తోడు పచ్చదండు వరుసగా వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ వారిపై దాడులకు పాల్పడుతూ భయపెట్టాలని ప్రయత్నిస్తోంది. అసభ్య పదజాలంతో దూషణలకు, కవ్వింపు చర్యలకు దిగుతోంది. వరుసగా ఒంగోలు, మార్కాపురం, కొండపి నియోజకవర్గాల్లో జరిగిన సంఘటనలే అందుకు ప్రత్యక్ష సాక్ష్యంగా నిలుస్తున్నాయి.

- ఓటమి భయంతో అరాచకాలు
- అసహనంలో టీడీపీ జిల్లా నేతలు
- అధినేత బెదిరింపులు.. దాడులకు తెగబడుతున్న పచ్చ సైన్యం
- ఒంగోలులో ప్రచారానికి వెళ్లిన బాలినేని కోడలిపై దాడికి యత్నం
- కొండపిలో వైఎస్సార్‌సీపీ కార్యకర్తల ఇళ్లపై దాడి
- తాజాగా మార్కాపురంలో వైఎస్సార్‌సీపీ మూడు ప్రచార రథాలపై దాడి

సాక్షి ప్రతినిధి, ఒంగోలు: గతంలో టీడీపీ పాలనను, ప్రస్తుతం వైఎస్సార్ సీపీ పాలనతో బేరీజు వేసుకుంటూ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి వెంట ప్రజలు పరుగులు పెడుతున్నారు. ఇది చూసిన పచ్చబ్యాచ్‌కు వెన్నులో వణుకు మొదలైంది. ఓటమి కళ్లెదుటే కనబడుతుండే ప్రత్యర్థి పార్టీ వారిని భయపెట్టేలా పన్నాగాలు పన్నుతున్నాయి. వైఎస్సార్‌సీపీ నేతలు, కార్యకర్తలపై దాడులు చేస్తూ రెచ్చిపోతున్నాయి. ఈ ఎన్నికలే కాదు ప్రతి ఎన్నికల్లోనూ ఇదే ధోరణి. ఎన్నికలంటే ప్రశాంత వాతావరణంలో, ప్రజాస్వామ్య బద్ధంగా చేసుకోవాల్సిన తంతు. ఎవరి పార్టీ నాయకులు ఆపార్టీ విధానాలు, సిద్ధాంతాలు ప్రజలకు చెప్పుకొంటూ ఓటు తమ పార్టీకి వేయాలని అడగడం రివాజు. అందుకు భిన్నంగా ప్రవర్తిస్తున్నాయి తెలుగుదేశం పార్టీ శ్రేణులు.



మార్కాపురంలో టీడీపీ కార్యకర్తలు ఫ్లెక్సీలు చించిన వైఎస్సార్ సీపీ ప్రచార రథం

మార్కాపురంలో వైఎస్సార్‌సీపీ అభ్యర్థి, గిద్దలూరు ఎమ్మెల్యే అన్నా రాంబాబుకు చెందిన మూడు ప్రచార రథాలపై పచ్చమూకలు శుక్రవారం రాత్రి బరితెగించి మరీ దాడులకు పాల్పడ్డాయి. ప్రచార రథాల డ్రైవర్లు వీరాంజనేయులు, ఆంథోని, రాజులను శరీరాల్లో కనపడని దెబ్బలతో కుళ్లబొడిచాయి. మార్కాపురం పట్టణంలోని 10వ వార్డులో ప్రచారం చేస్తున్న ప్రచార రథాన్ని టీడీపీ నేతలు, కార్యకర్తలు అడ్డుకున్నారు. ఈ వీధుల్లో మీకేమి పనిరా అంటూ వాహనంలో నుంచి డ్రైవర్‌ను లాగి కింద పడేసి కొట్టారు. పార్టీ ఫ్లెక్సీలు చించేశారు. అదేవిధంగా మార్కాపురం రూరల్‌లోని మిట్టమీద పల్లి, మాల్యవంతునిపాడు గ్రామాల్లో ప్రచారం చేస్తున్న వైఎస్సార్‌సీపీకి చెందిన మరో ప్రచార రథాన్ని అడ్డుకొని డ్రైవర్ రాజుని లాగి కిందపడేశారు. చితకబాది వాహనానికి ఉన్న ఫ్లెక్సీలను చించేశారు. గ్రామాల్లో తిరిగితే నీ అంతు చూస్తామంటూ బెదిరింపులకు దిగారు. అలాగే తర్లుపాడులో ప్రచారం నిర్వహిస్తున్న ప్రచార రథాన్ని కూడా అడ్డుకున్నారు. డ్రైవర్ ఆంథోనిపై దాడి చేశారు. ఒకే రోజు మార్కాపురం నియోజకవర్గంలో మూడు ప్రచార రథాలపై దాడులు చేసి టీడీపీ మూకలు భయభ్రాంతులకు గురి చేయడం చర్చనీయాంశంగా మారింది.

కొండపిలో వైఎస్సార్ సీపీ అభిమాని కుటుంబంపై దాడి...

కొండపి అసెంబ్లీ నియోజకవర్గం కొండపి మండలం మిట్టపాలెం గ్రామంలోని వైఎస్సార్‌సీపీ అభిమాని ఇంటిపై పచ్చదండు దాడులకు తెగబడింది. ఈ ఘటన గురువారం చోటుచేసుకుంది. మిట్టపాలెం గ్రామంలోని ఎస్సీ కాలనీలో 60 కుటుంబాలు ఉంటే వాళ్లలో గడ్డం కిషోర్ ఒక్క కుటుంబం వైఎస్సార్‌సీపీ అభిమానిగా ఉంది. మిగతా కుటుంబాలన్నీ టీడీపీకి చెందిన వారే. అయితే ఆ కుటుంబాన్ని కూడా టీడీపీలో రావాలని అడిగారు. అందుకు అంగీకరించలేదు. అంతే టీడీపీ నాయకుడు ఐనంపూడి రమేష్ తన అనుచరులతో రాత్రి 11.40 గంటల సమయంలో గడ్డం కిషోర్ ఇంటిపై దాడి చేసి ఇంట్లో ఉన్న ఐదుగురిపై దాడికి పాల్పడ్డారు. మురుగు కాలువలో పడేసి మరీ కొట్టారు. మహిళలు అని కూడా చూడకుండా దాడులకు పాల్పడ్డారు. ఐదు సంవత్సరాల నుంచి గడ్డం కిషోర్ కుటుంబాన్ని టీడీపీలోకి రమ్మని వేధిస్తూనే ఉన్నారు. అయినా ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్ రెడ్డి మీద ఉన్న అభిమానం, రాష్ట్రంలో ఆయన చేస్తున్న సంక్షేమం, అభివృద్ధి పనులను చూస్తున్న కిషోర్ వైఎస్సార్‌సీపీని వీడేది లేదంటూ తెగేసి చెబుతూ వస్తున్నాడు. అది సహించలేని వారు అర్ధరాత్రి ఇంటిమీద పడి దాడులు చేసి తీవ్రంగా కొట్టారు. ప్రస్తుతం వాళ్లు తీవ్రగాయాలతో ఒంగోలు జీజీహెచ్‌లో చికిత్స పొందుతున్నారు.

ఒంగోలులో బాలినేని కోడలు ప్రచారంలోనూ...

ప్రశాంతంగా ఉండే జిల్లా కేంద్రం ఒంగోలు నగరంలో వైఎస్సార్‌సీపీకి చెందిన నాయకులు, కార్యకర్తలతో మాజీ మంత్రి, ఒంగోలు ఎమ్మెల్యే బాలినేని శ్రీనివాసులు రెడ్డి కోడలు శ్రీకావ్య ఎన్నికల ప్రచారం నిర్వహిస్తున్నారు. ఒక పథకం ప్రకారం ఆమె ప్రచారాన్ని అడ్డుకుని బీభత్సాన్ని సృష్టించారు. 37వ డివిజన్‌లోని సమతా నగర్‌లో ఈ నెల 10వ తేదీన ఇంటింటి ప్రచారం చేస్తూ హిమశ్రీ నిలయం అపార్ట్‌మెంట్ లోపలకు తన అనుచరులతో కలిసి వెళ్లే ప్రయత్నం చేశారు. ఇంతలో ఆ అపార్ట్‌మెంట్‌లోనే అద్దెకు ఉంటున్న టీడీపీ అభిమాని ఏఆర్ కానిస్టేబుల్ చప్పిడి లక్ష్మీ నారాయణ చౌదరి ఆమెను అడ్డుకున్నారు. అడ్డుకోవటంతో పాటు అపార్ట్‌మెంట్ గేటుకు తాళం వేశాడు. అప్పటికీ శ్రీకావ్య మీ ఇంటికి రావద్దు అంటే రాకుండా ఉంటాము అపార్ట్‌మెంట్‌లో మిగతా వారి ఇళ్లకు వెళ్లి ప్రచారం చేసుకుంటాము అన్నా వినిపించుకోలేదు. ఇలా మాట్లాడుకుంటున్న సమయంలోనే కానిస్టేబుల్ లక్ష్మీ నారాయణ చౌదరి భార్య చప్పిడి ప్రభావతి అదే డివిజన్‌కు చెందిన టీడీపీ తరుపున కార్పొరేటర్‌గా పోటీ చేసిన ఓడిపోయిన మేడికొండ మోహన్ రావుకు ఫోన్ చేసి వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలు వచ్చి కొడుతున్నారని చెప్పింది. దీంతో హడావుడిగా మోహన్ రావు తన అనుచరులతో అక్కడకు చేరుకోవటంతో ప్రశాంతంగా ఉన్న వాతావరణం కాస్తా ఉద్రిక్త పరిస్థితులకు దారితీసింది. రావటం రావటం బండ బూతులు తిట్టుకుంటూ అపార్ట్‌మెంట్ వద్దకు వచ్చి వైఎస్సార్‌సీపీ అభిమానులు, కార్యకర్తలపై దాడి చేశాడు. గొడవ జరగకుండానే కొడుతున్నారని ప్రభావతి చెప్పి టీడీపీ వాళ్లను రెచ్చగొట్టింది. దీంతో ప్రశాంతంగా జరగాల్సిన వైఎస్సార్ సీపీ ప్రచారం కాస్తా రసాభాసగా మారింది. ఎన్నికల సమయంలో ఇలా వ్యవహరించడం తెలుగుదేశం పార్టీ వారికి అలవాటుగా మారింది. 2019 ఎన్నికల సమయంలోనూ ఇదే విధంగా వ్యవహరించింది. ఆ ఘటనలు ఇంకా జిల్లా వాసుల్లో మెదులుతూనే ఉన్నాయి.



పోలీసుల ఎదుటే రెచ్చగొడుతున్న టీడీపీ నాయకులు, కార్యకర్తలు (ఫైల్)

న్యూస్‌రీల్

టీడీపీ నేతల కోడ్ ఉల్లంఘన

- వందల సంఖ్యలో బైకులతో ర్యాలీ



అనుమతికి మించి నిర్వహించిన బైక్‌ర్యాలీలో పాల్గొన్న టీడీపీ కార్యకర్తలు

తర్లుపాడు: మండలంలోని సీతానాగులవరం నుంచి తర్లుపాడు వరకు టీడీపీ ఆధ్వర్యంలో శనివారం నిర్వహించిన బైక్ ర్యాలీలో కోడ్ ఉల్లంఘన జరిగింది. పర్యవేక్షించాల్సిన ఎన్నికల సిబ్బంది చోద్యం చూస్తుండటంపై సర్వత్రా విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. ఒంగోలు పార్లమెంట్ టీడీపీ అభ్యర్థి మాగుంట శ్రీనివాసుల రెడ్డి, మార్కాపురం టీడీపీ ఎమ్మెల్యే అభ్యర్థి కందుల నారాయణరెడ్డి నిర్వహించిన బైక్ ర్యాలీకి 65 బైక్‌లకు పర్మిషన్ తీసుకోగా 200లకు పైగా బైక్‌లు పాల్గొన్నాయి. దీంతో మార్కాపురం వెళ్లే వాహనదారులు ఇబ్బందులు పడ్డారు. భారీ శబ్దంతో హారన్‌లు మోగిస్తూ ప్రయాణికులకు ఇబ్బంది కలుగజేశారు.

టీడీపీ బైక్‌ర్యాలీలో పాల్గొన్న వలంటీర్ తొలగింపు

మార్కాపురం రూరల్: మార్కాపురం పట్టణంలో శుక్రవారం రాత్రి టీడీపీ నేతలు నిర్వహించిన బైక్‌ర్యాలీలో పాల్గొన్న మార్కాపురం మండలం గోగులదిన్నె గ్రామానికి చెందిన వలంటీరు పల్లెపోలు వెంకట శ్రీనివాసరెడ్డిని విధుల నుంచి తొలగించినట్లు ఎంపీడీవో తోట చందన తెలిపారు.

పొగాకు గరిష్ట ధర రూ.260

కొండపి (మర్రిపూడి): స్థానిక పొగాకు వేలం కేంద్రం పరిధిలో శనివారం జరిగిన వేలంలో పొగాకు గరిష్ట ధర రూ.260 పలికింది. వ్యాపారులు కట్టావారిపాలెం, నర్సింగోలు గ్రామాలకు చెందిన రైతులు 1067 పొగాకు బేళ్లను వేలానికి తీసుకొని రాగా 842 బేళ్లు కొనుగోలయ్యాయి. 225 బేళ్లను వ్యాపారులు తిరస్కరించారు. పొగాకు గరిష్ట ధర రూ.260, కనిష్ట ధర రూ.220, సరాసరి ధర రూ.231.5 పలికింది.

చెవిరెడ్డికి లక్ష మెజార్టీ ఖాయం

- ఉమ్మడి ప్రకాశంలో 12 అసెంబ్లీ స్థానాల్లో వైఎస్సార్ సీపీదే విజయం
- సామాజిక న్యాయం వైఎస్సార్ సీపీకే సాధ్యం
- నామినేషన్ దాఖలు చేసిన వైఎస్సార్ సీపీ ఎంపీ అభ్యర్థి చెవిరెడ్డి
- వెంట ఉన్న బాలినేని, శిద్దా, టీజేఆర్, కదిరి



మీడియా సమావేశంలో బాలినేని, చెవిరెడ్డి, శిద్దా, కదిరి, టీజేఆర్

ఒంగోలు అర్బన్: ఒంగోలు పార్లమెంట్ ఎప్పుడూ వైఎస్సార్ సీపీకి అనుకూలంగా ఉంటుందని, పార్టీ ఎంపీ అభ్యర్థి చెవిరెడ్డి భాస్కరరెడ్డి లక్ష మెజార్టీతో విజయం సాధిస్తారని మాజీ మంత్రి ఎమ్మెల్యే బాలినేని శ్రీనివాసరెడ్డి అన్నారు. శనివారం కలెక్టరేట్‌లో పార్లమెంట్ నియోజకవర్గ రిటర్నింగ్ అధికారి ఏఎస్ దినేష్‌కుమార్ వద్ద చెవిరెడ్డి భాస్కరరెడ్డి నామినేషన్ దాఖలు చేశారు. అనంతరం రిటర్నింగ్ అధికారి కార్యాలయం బయట ఉన్న మీడియా పాయింట్‌లో బాలినేని మాట్లాడారు. సీఎం జగన్ మోహన్‌రెడ్డికి అత్యంత సన్నిహితుడిగా, పార్టీ కార్యక్రమాలు చూసుకుంటూ ఉంటారని, రెండు సార్లు చంద్రగిరి ఎమ్మెల్యేగా ఉన్నారని, ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి ఎంతో ఆలోచించి ఆయనను ఎంపీ అభ్యర్థిగా నిలబెట్టారని బాలినేని చెప్పారు. వెంకటేశ్వరస్వామి ఆశీస్సులతో చెవిరెడ్డి భారీ మెజార్టీతో గెలుస్తారని ధీమా వ్యక్తం చేశారు. అందరం సమన్వయంతో పని చేస్తే ఉమ్మడి ప్రకాశంలో జిల్లాలో వైఎస్సార్‌సీపీ విజయం సాధిస్తుందన్నారు. జిల్లాలో ఎంపీ, అన్ని ఎమ్మెల్యే స్థానాల్లో విజయం సాధించి ముఖ్యమంత్రికి కానుకగా ఇస్తామన్నారు. సంక్షేమ పథకాలు అమలు కావాలంటే జగన్‌మోహన్‌రెడ్డి మళ్లీ సీఎంను చేసుకోవాలంటున్నారు. జిల్లా ప్రజలు సీఎంపై ఎంతో ప్రేమగా ఉన్నారని, ఇటీవల నిర్వహించిన సీఎం పర్యటన దిగ్విజయం కావడం ఇందుకు నిదర్శమన్నారు. ఓటమి భయంతో కూటమి పార్టీలు వైఎస్సార్ సీపీ నేతలపై, ప్రచార వాహనాలపై దాడులు చేస్తున్నారని అన్నారు. మార్కాపురంలో జరిగిన ఘటనపై ఎన్నికల సంఘానికి ఫిర్యాదు చేస్తామన్నారు.



ఒంగోలు పార్లమెంట్ వైఎస్సార్‌సీపీ అభ్యర్థిగా నామినేషన్ వేస్తున్న చెవిరెడ్డి భాస్కరరెడ్డి, పక్కన బాలినేని

మళ్లీ రాజన్న పాలన..

ఎంపీ అభ్యర్థి చెవిరెడ్డి భాస్కరరెడ్డి మాట్లాడుతూ జిల్లాలోని పార్టీ పెద్దల సమక్షంలో ఎంపీ అభ్యర్థిగా నామినేషన్ దాఖలు చేశానన్నారు. రాష్ట్రంలో జగన్ మోహన్‌రెడ్డి సీఎం అయితేనే సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలు జరుగుతాయని ప్రజలు నమ్ముతున్నారని చెప్పారు. ప్రజల్లోకి వెళ్లినపుడు వారు బ్రహ్మరథం పడుతున్న విషయాన్ని పరిశీలిస్తే అది స్పష్టంగా కనిపిస్తోందన్నారు. కులం, మతం, పార్టీ, వర్గం చూడకుండా అన్ని వర్గాలకు మేలు చేసేందుకు సీఎం కృషి చేస్తున్నారని చెప్పారు. రాష్ట్రంలో మళ్లీ రాజన్న పాలన తెచ్చుకునేందుకు ప్రజలు సంసిద్ధంగా ఉన్నారని అన్నారు. మాజీ మంత్రి శిద్దా రాఘవరావు మాట్లాడుతూ చెవిరెడ్డి భాస్కరరెడ్డి అనేక ఆధ్యాత్మిక కార్యక్రమాలు నిర్వహించారని, జిల్లాలోని అన్ని నియోజకవర్గాల్లో పార్టీని, చెవిరెడ్డిని గెలిపించాలని విజ్ఞప్తి చేశారు. సీఎం జగన్ మోహన్‌రెడ్డి పలు సంక్షేమ పథకాలు అమలు చేస్తూ పేద ప్రజలకు దగ్గరయ్యారన్నారు. మాజీ ఎమ్మెల్యే కదిరి బాబురావు మాట్లాడుతూ అన్ని సామాజిక వర్గాలకు సమన్యాయం చేస్తూ ముఖ్యమంత్రి జగన్ మోహన్‌రెడ్డి టికెట్లు కేటాయించారన్నారు. టీడీపీ అధినేత చంద్రబాబు ఎలాంటి సామాజిక న్యాయం పాటించలేదన్నారు. కాపులకు ఒక్కసీటు కేటాయించలేదని చెప్పారు. పవన్ కల్యాణ్ కాపులకు అన్యాయం చేశారన్నారు. రానున్న ఎన్నికల్లో కాపులు సైతం వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీని గెలిపిస్తారన్నారు. ఎమ్మెల్యే టీజేఆర్ సుధాకర్ బాబు మాట్లాడుతూ అన్నీ బలహీన వర్గాలకు వైఎస్సార్ సీపీ ఒక మంచి ప్లాట్‌ఫాం అని అన్నారు. ప్రభుత్వం అమలు చేసిన సంక్షేమ పథకాలు కుల, మత, రాజకీయ పార్టీలకు అతీతంగా అర్హులందరికీ ఇంటికే అందజేశారన్నారు. ఎంపీ అభ్యర్థి చెవిరెడ్డి వైఎస్ కుటుంబంతో మూడు తరాల అనుబంధం కలిగిన వ్యక్తి అని, ఎంత ఎదిగినా ఒదిగి ఉండే గుణం చెవిరెడ్డిదన్నారు. పేదలకు వైఎస్ జగన్ విలువ తెలుసని, ఆయన సీఎం అయితే పథకాలు, పింఛన్‌లు ఇంటికి వస్తాయని ప్రజలు బలంగా నమ్ముతున్నారన్నారు. టీడీపీ మూకలు మార్కాపురంలో వైఎస్సార్ సీపీ ప్రచార వాహనాన్ని ధ్వంసం చేయడం సిగ్గుచేటన్నారు. ఓటమి భయంతోనే దాడులకు పాల్పడుతున్నారన్నారు. సమావేశంలో పార్టీ నాయకులు కేవీ రమణారెడ్డి, వెంకటేశ్వరరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఆయుధం చేతికిచ్చా..విజయం సాధించు

- మంత్రి సురేష్‌తో ఎంపీ అభ్యర్థి చెవిరెడ్డి భాస్కరరెడ్డి

సింగరాయకొండ (మర్రిపూడి): సార్వత్రిక ఎన్నికల్లో పోటీ చేయటానికి అవసరమైన ఆయుధం బీఫాం చేతికి ఇచ్చా ఇక నీ తడాఖా చూపించు.. విజయం సాధించు అని వైఎస్సార్‌సీపీ ఒంగోలు ఎంపీ అభ్యర్థి చెవిరెడ్డి భాస్కరరెడ్డి, రాష్ట్ర పురపాలక, పట్టణాభివృద్ధి శాఖా మంత్రి, వైఎస్సార్‌సీపీ కొండపి నియోజకవర్గ అసెంబ్లీ అభ్యర్థి డాక్టర్ ఆదిమూలపు సురేష్‌కు సూచించారు. కొండపి వైఎస్సార్ సీపీ కార్యాలయంలో శనివారం సాయంత్రం మంత్రి సురేష్‌కు చెవిరెడ్డి బీ ఫాం పత్రాలను స్వయంగా అందజేశారు. చెవిరెడ్డి మాట్లాడుతూ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి కొండపి నియోజకవర్గంలో పార్టీ జెండా ఎగురవేయటానికి, బీఫాం అందజేయటానికి పంపించారన్నారు. ఈ ఎన్నికల్లో ఎమ్మెల్యే స్వామి హ్యాట్రిక్ గెలుపును అడ్డుకోవటమే కాక ప్రతిపక్ష పార్టీలకు దిమ్మతిరిగేలా అఖండ మెజారిటీతో కొండపి గడ్డపై పార్టీ జెండా ఎగురవేయాలని సూచించారు. ఈ సందర్భంగా పార్టీ నాయకులు, కార్యకర్తలు వైఎస్సార్‌సీపీ జెండా ఎగురవేయటమే తమ కర్తవ్యమని జై జగన్, జైసురేష్, జై చెవిరెడ్డి అని నినాదాలు చేశారు. పార్టీ నాయకుల గెలుపే లక్ష్యంగా కృషి చేస్తామని మంత్రి సురేష్‌కు భరోసా ఇచ్చారు. మండల కన్వీనర్ ఆరికట్ల కోటిలింగం, జేసీఎస్ కన్వీనర్ గొట్టిపాటి మురళి, రాష్ట్ర సహాయ కార్యదర్శి ఢాకా పిచ్చిరెడ్డి, పెద్ద కళ్లగుంట సర్పంచ్ భువనగిరి సత్యన్నారాయణ, మారెడ్డి వెంకటాద్రిరెడ్డి, వైస్ ఎంపీపీ వేముల ప్రసాద్, బొక్కిసం సుబ్బారావు, చింతల వెంకటేశ్వర్లు, సుధాకర్, మండల ఎస్సీసెల్ అధ్యక్షుడు గర్నిపూడి రమేష్, తాటాకులపాలెం సర్పంచ్ వన్నూరు, ఆళ్ల శ్రీనివాసులరెడ్డి, రమణారెడ్డి, శేఖర్‌రెడ్డి, పర్చూరి సుబ్బయ్య, మోపర్తి నారాయణ, తదితరులు పాల్గొన్నారు.



కొండపి పార్టీ కార్యాలయంలో మంత్రి సురేష్‌కు బీఫాం అందజేస్తున్న చెవిరెడ్డి

జగనన్నతో ప్రతి కుటుంబానికి మేలు

- మాజీ మంత్రి, ఒంగోలు ఎమ్మెల్యే బాలినేని



మహిళకు అభివాదం చేస్తున్న ఎమ్మెల్యే బాలినేని శ్రీనివాసరెడ్డి

ఒంగోలు సెంట్రల్: రాష్ట్రంలోని అన్ని వర్గాల ప్రజలకు కుల మతాలు, పార్టీలకు అతీతంగా అర్హత ఉన్న ప్రతి కుటుంబానికి ప్రభుత్వ సంక్షేమ పథకాలు అందిస్తూ ఆదర్శవంతమైన పాలన సాగిస్తున్న జగనన్నను మళ్లీ ఆశీర్వదించాలని మాజీ మంత్రి, ఒంగోలు ఎమ్మెల్యే బాలినేని శ్రీనివాసరెడ్డి అన్నారు. ఒంగోలులో 50వ డివిజన్ నెహ్రూ కాలనీలో మన ఒంగోలు–మన వాసన్న కార్యక్రమం నిర్వహించారు. డివిజన్ కార్పొరేటర్ అంబటి దుర్గా ప్రసాదరావు, డివిజన్ అధ్యక్షుడు జల్లిపల్లి సురేష్‌లతో కలిసి కాలనీలో ప్రచార కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా మాజీ మంత్రి, ఒంగోలు ఎమ్మెల్యే బాలినేని శ్రీనివాస రెడ్డి మాట్లాడుతూ జగనన్నతో ప్రతి కుటుంబానికి మేలు జరిగిందని, గ్రామ, వార్డు సచివాలయంతో గడప ముంగిటకే తీసుకొచ్చి పాలనను గ్రామాల్లోనే కొనసాగించారని చెప్పారు. ఒంగోలు నగరాన్ని ఎంతగానే అభివృద్ధి చేశారని అన్నారు. మరోమారు సేవ చేసుకునే అవకాశం ఇవ్వాలని, తనకు, ఎంపీ అభ్యర్థి చెవిరెడ్డి భాస్కరరెడ్డికి ఓట్లు వేసి అత్యధిక మెజార్టీతో గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో డివిజన్ ఇన్‌చార్జి ప్రసాద్ రెడ్డి, మాజీ ఎమ్మెల్యే కసుకుర్తి ఆదెన్న, ఒంగోలు నగర మేయర్ గంగాడ సుజాత, వైఎస్సార్ సీపీ ఒంగోలు నగర అధ్యక్షుడు కఠారి శంకర్, డివిజన్ కార్పొరేటర్ ఏ ప్రసాదరావు, డివిజన్ అధ్యక్షుడు, జే సురేష్, ఏఎంసీ చైర్మన్ కొఠారి రామచంద్రరావు, రాష్ట్ర మైనార్టీ సెల్ జాయింట్ సెక్రటరీ షేక్ అబ్దుల్ ఖుద్దూస్, మీరావలి, షేక్ బాజి, ప్రచార కమిటీ ప్రధాన కార్యదర్శి దామరాజు క్రాంతి కుమార్, డివిజన్ మాజీ అధ్యక్షుడు గల్లా దుర్గా, బేతపూడి భాస్కరరావు, జెల్లుపల్లి సుబ్బులు, బాజీ, దానం శ్రీదేవి, చక్రపాణి, ఏడుకొండలు, రవి,మారుతి, శ్రీరాములు, రమేష్, బొమ్మినేని మురళి, శ్రీను, నాగమణి,శివారెడ్డి, మల్లేశ్వరి, మణికంఠ తదితరులు పాల్గొన్నారు.

రామాలయంలో ప్రత్యేక పూజలు:

50వ డివిజన్‌లో మన ఒంగోలు–మన వాసన్న కార్యక్రమ నిర్వహణకు వచ్చిన బాలినేని శ్రీనివాస రెడ్డిని డివిజన్ కార్పొరేటర్, అధ్యక్షుడి ఆధ్వర్యంలో నాయకులు, మహిళలు అధిక సంఖ్యలో పాల్గొని పూలు జల్లుతూ స్వాగతం పలికారు. బొకేలు, దండలు వేసి స్వాగతం పలికారు. నెహ్రూ కాలనీలో రామాలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు.

మూడో రోజు 14 నామినేషన్లు

- ఎంపీ స్థానానికి నాలుగు, అసెంబ్లీ స్థానాలకు 10 నామినేషన్లు

ఒంగోలు అర్బన్: సార్వత్రిక ఎన్నికల్లో భాగంగా జరుగుతున్న నామినేషన్ల ప్రక్రియలో మూడో రోజు జిల్లాలో ఒక పార్లమెంట్, 8 అసెంబ్లీ స్థానాలకు సంబంధించి మొత్తం 14 మంది అభ్యర్థులు 17 నామినేషన్లు దాఖలు చేశారు. కొంతమంది ఒక్కో సెట్, మరికొంత మంది రెండు సెట్ల చొప్పున రిటర్నింగ్ అధికారులకు అందజేశారు. పార్లమెంట్ నియోజకవర్గానికి సంబంధించి వైఎస్సార్ సీపీ తరఫున ఎంపీ అభ్యర్థిగా చెవిరెడ్డి భాస్కరరెడ్డి రెండు సెట్లు, చెవిరెడ్డి లక్ష్మి ఒక సెట్ దాఖలు చేయగా స్వతంత్ర అభ్యర్థులుగా రాయపాటి జగదీష్, ఆకుమళ్ల మల్లికార్జునరెడ్డిలు రిటర్నింగ్ అధికారి ఏఎస్ దినేష్‌కుమార్‌కు నామినేషన్ పత్రాలు దాఖలు చేశారు. జిల్లాలోని ఎనిమిది అసెంబ్లీ నియోజకవర్గాలకు సంబంధించి మార్కాపురం, సంతనూతలపాడు, కనిగిరి సెగ్మెంట్‌లలో ఒక్క నామినేషన్ కూడా దాఖలు కాలేదు. యర్రగొండపాలెం అసెంబ్లీకి స్వతంత్ర అభ్యర్థిగా గొట్టిముక్కల సుజాత, దర్శి అసెంబ్లీకి టీడీపీ తరఫున గొట్టిపాటి లక్ష్మి, బహుజన సమాజ్ పార్టీ నుంచి ఇత్తడి శివప్రసాద్, ఒంగోలు అసెంబ్లీకి స్వతంత్ర అభ్యర్థిగా చప్పిడి రవిబాబు, కొండపి అసెంబ్లీ నియోజకవర్గంలో వైఎస్సార్ సీపీ తరఫున ఆదిమూలపు సురేష్, పరిమిడ్ పార్టీ నుంచి బాలకోటయ్య మెండ, బీఎస్పీ నుంచి రావినూతల మాత్రిక, స్వతంత్ర అభ్యర్థిగా మామిడి మాల్యాద్రి, గిద్దలూరు అసెంబ్లీకి స్వతంత్ర అభ్యర్థులుగా బాలసాని మాల్యాద్రి రెడ్డి, కొప్పోలు నరసింహులు నామినేషన్‌లు ఆయా రిటర్నింగ్ అధికారులకు అందజేశారు.

దళిత బంధువు వైఎస్ జగన్



సంక్షేమ పథకాలు, అభివృద్ధి గురించి వివరిస్తున్న మంత్రి మేరుగు నాగార్జున

- దళితులకు ఆత్మ గౌరవం వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలోనే..
- ఎన్నికల ప్రచారంలో మంత్రి మేరుగు

చీమకుర్తి రూరల్: వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలోనే దళితులకు ఆత్మగౌరవం దక్కిందని, అన్ని రంగాల్లో సమ ప్రాధాన్యత కల్పించిన ఘనత సీఎం వైఎస్ జగన్‌కే దక్కుతుందని మంత్రి మేరుగు నాగార్జున అన్నారు. చీమకుర్తి మండలం అగ్రహారం ఎస్సీ కాలనీలో మంత్రి మేరుగు నాగార్జున ఎన్నికల ప్రచారం నిర్వహించారు. గ్రామంలో మంత్రి మేరుగు నాగార్జునకు స్థానిక నాయకులు, అభిమానులు, కార్యకర్తలు పూల మాలలు, శాలువతో సత్కరించి గజమాలతో ఆహ్వానం పలికారు. ముందుగా వెంకటేశ్వర స్వామి వారి గుడిలో ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం ప్రచార కార్యక్రమం నిర్వహించారు. ఎస్సీ కాలనీలో మంత్రి మేరుగు నాగార్జున మాట్లాడుతూ ఎస్సీలకు అగ్రపీఠం వేసిన వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలోనే దళితులకు ఆత్మగౌరవం దక్కిందని అన్నారు. ఒకప్పుడు చంద్రబాబు దళితులంటే చిన్న చూపు చూసేవారని, చులకనగా మాట్లాడేవారని, మీకెందుకు రాజకీయాలని చంద్రబాబు దెప్పి పొడిచేవారని అన్నారు. సినిమాల్లో చూపించినట్లుగా టీడీపీ పెత్తందార్లు ప్రవర్తించేవారన్నారు. వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలో ఉద్దండులు చేపట్టిన స్థానాల్లో సైతం దళిత నేతలను కూర్చోబెట్టారన్నారు. నామినేటెడ్ పదవుల్లో ఎస్సీలకు అగ్రపీఠం వేశారన్నారు. వైఎస్సార్ సీపీ ప్రభుత్వం పేద, బడుగు, బలహీన వర్గాల కోసం అనేక పథకాలు ప్రవేశపెట్టిందని తెలిపారు. సంక్షేమం, అభివృద్ధి కోసం జగనన్నను మరోసారి ముఖ్యమంత్రి చేసే బాధ్యత మన మీద ఉందని వివరించారు. అందుకోసం సంతనూతలపాడు ఎమ్మెల్యేగా తనను, బాపట్ల ఎంపీగా నందిగం సురేష్కు ఫ్యాన్ గుర్తుకు ఓటేసి అఖండ మెజారిటీతో గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో మండల పార్టీ అధ్యక్షుడు పమిడి వెంకటేశ్వర్లు, ఎంపీపీ యద్దనపూడి శ్రీనివాసరావు, జెడ్పీటీసీ వేమా శ్రీనివాసరావు, కిష్టపాటి శేఖర్ రెడ్డి, బండ్లమూడి సర్పంచ్ వెంకటలక్ష్మి రామారావు, ఎంపీటీసీ విజయలక్ష్మి శేషురెడ్డి, గోపి, నాగరాజు, ఏడుకొండలు తదితరులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

టీడీపీ ప్రచార రథమా.. ద్విచక్ర వాహనమా!



టంగుటూరులో ఎన్నికల కోడ్ ఉల్లంఘిస్తూ తిరుగుతున్న ద్విచక్ర వాహనం

టంగుటూరు: టీడీపీ ఎమ్మెల్యే అభ్యర్థి స్వామి, నాయకులు ఎన్నికల నిబంధనలు తుంగలో తొక్కుతూ యథేచ్ఛగా ఎన్నిక కోడ్ ఉల్లంఘిస్తున్నారు. ద్విచక్ర వాహనాలు టీడీపీ ప్రచార రథాలుగా మార్చుకొని అనుమతుల లేకుండా రోడ్లపై తిప్పుతున్నారు. టీడీపీ ఎమ్మెల్యే అభ్యర్థి స్వామి, దామచర్ల సత్యనారాయణ, టంగుటూరు మండల అధ్యక్షుడు కామని విజయకుమార్ల ఫొటోలు ముద్రించిన ఓ వాహనం హల్ చల్ చేస్తోంది. ఇలా తిరుగున్నా ఎన్నికల అధికారులు, ఫ్లెయింగ్ స్క్వాడ్ పట్టీపట్టనట్లు వ్యవహరిస్తున్నారు.

గురుకులాల్లో ప్రవేశానికి కౌన్సిలింగ్

బేస్తవారిపేట: జిల్లాలోని డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ గురుకుల పాఠశాలల్లో 5వ తరగతిలో మిగిలిన సీట్లకు దర్శిలో ఈ నెల 24వ తేదీన ఉదయం 9 గంటలకు కౌన్సిలింగ్ నిర్వహిస్తున్నట్లు అర్ధవీడు గురుకుల పాఠశాల ప్రిన్సిపాల్ బి.బలరామిరెడ్డి తెలిపారు. మొదటి మెరిట్ లిస్ట్‌లో సీటు రాని వారు హాజరు కావాలని కోరారు. పూర్తి వివరాలకు గురుకుల పాఠశాలల ప్రిన్సిపాల్స్‌ను సంప్రదించాలని కోరారు.

యర్రగొండపాలెంలో
టీడీపీ భోషాణం ఖాళీ

- అజితారావు కాంగ్రెస్‌లో చేరడంతో రెండుగా చీలిన క్యాడర్
- అగమ్యగోచరంగా టీడీపీ అభ్యర్థి ఎరిక్షన్‌బాబు పరిస్థితి
- గెలుపు అవకాశాలు ఏమాత్రం లేవని తేలడంతో జిమ్మిక్కులు
- పార్టీలోకి చేరికలంటూ కార్యకర్తలకే కండువాలు కప్పేస్తున్న వైనం



యర్రగొండపాలెం: యర్రగొండపాలెం నియోజకవర్గంలో టీడీపీ పరిస్థితి రోజురోజుకూ క్షీణిస్తోంది. గత ఎన్నికల్లో ఓటమి చవిచూసిన బూదాల అజితారావు 'బై బై బాబు' అంటూ టీడీపీకి రాజీనామా చేసి కాంగ్రెస్ గూటికి చేరడం.. పార్టీ ముఖ్య నేతల మధ్య వర్గపోరు కొనసాగుతుండటంతో తెలుగు తమ్ముళ్లలో తీవ్ర నైరాశ్యం నెలకొంది. అజితారావు వర్గం పూర్తిగా దూరం కావడం, మరో వైపు వైఎస్సార్ సీపీలోకి వలసలు ఆగకపోవడంతో గెలుపు అవకాశాలు ఏమాత్రం కనిపించడం లేదని టీడీపీ ద్వితీయ శ్రేణి నాయకులు ఆందోళన చెందుతున్నారు. టీడీపీ ముఖ్య నేతల వర్గపోరుతో సతమతమవుతున్న తెలుగు తమ్ముళ్లు ఇప్పటికే ఎవరిదారి వారు చూసుకున్నారు. దీంతో టీడీపీ భోషాణం ఖాళీ అయ్యి ఆ పార్టీ అభ్యర్థి ఎరిక్షన్ బాబు పరిస్థితి అగమ్యగోచరంగా మారింది. పార్టీలో విభేదాలను చక్కదిద్దేందుకు టీడీపీ అధిష్టానం చేసిన ప్రయత్నాలు కూడా విఫలమైనట్టే కనిపిస్తోంది. ఎరిక్షన్‌తో తొలి నుంచీ విభేదించి పార్టీ కార్యక్రమాలకు దూరంగా ఉన్న రాష్ట్ర టెక్నాలజీ కార్పొరేషన్ మాజీ చైర్మన్ డాక్టర్ మన్నె రవీంద్రకు ఇటీవల టీడీపీ పెద్దలు నామినేటెడ్ పదవి ఆశ చూపారు. కలిసి పనిచేయాలని సూచించారు. అయితే టీడీపీ అభ్యర్థికి మద్దతుగా డాక్టర్‌తో కలిసి పనిచేయడానికి ససేమిరా ఇష్టపడని ఆయన వర్గీయులు పార్టీ కార్యక్రమాలకు దూరంగా ఉంటున్నారు. ఎరిక్షన్ బాబు కూడా 'అంతా నేనే' అన్నట్టు వ్యవహరిస్తూ తన వెంట ఉన్న నలుగురితోనే గ్రామాలకు వెళ్లడం మన్నె వర్గంలో మరింత ఆగ్రహాన్ని రగిల్చింది. ఈ క్రమంలో టీడీపీ సానుభూతిపరులకే పచ్చ కండువాలు కప్పి ఎరిక్షన్‌బాబు ఫొటోలకు ఫోజులివ్వడం, పార్టీలోకి చేరికలు భారీగా ఉన్నాయని ఎల్లో మీడియాలో ప్రచారం చేయించడం చూసి టీడీపీ నాయకులే నవ్వుకుంటున్నారు.

అజితారావు నిర్ణయంతో కకావికలం

వైపాలెం టీడీపీ అభ్యర్థిగా 2014, 2019 ఎన్నికల్లో బూదాల అజితారావు పోటీ చేసి ఓటమి చెందినా నియోజకవర్గంలో తనకంటూ ఒక వర్గాన్ని ఏర్పరుచుకున్నారు. ఆమె స్థానికంగా ఉండటం లేదన్న కారణంతో నియోజకవర్గ ఇన్‌చార్జి పదవి నుంచి తొలగించిన టీడీపీ అధినేత చంద్రబాబు.. మూడేళ్ల క్రితం కనిగిరి ప్రాంతానికి చెందిన గూడూరి ఎరిక్షన్ బాబుకు వైపాలెం బాధ్యతలు అప్పగించారు. ఆయన బాధ్యతలు స్వీకరించిన నాటి నుంచే టీడీపీలో అంతర్గత పోరు మొదలైంది. ఎన్నికల్లో తనకే టికెట్ ఇవ్వాలని అజితారావు గట్టిగా పట్టుబట్టినా చంద్రబాబు నో చెప్పడంతో ఆమె కాంగ్రెస్ కండువా కప్పుకొని ఎమ్మెల్యే అభ్యర్థిగా బరిలోకి దిగింది. గత పదేళ్లుగా అజితారావు వెంట నడిచిన వారంతా టీడీపీకి దూరమయ్యారు.

వారిలో కొందరు వైఎస్సార్ సీపీలో చేరి ఆ పార్టీ అభ్యర్థి తరఫున ముమ్మరంగా ఎన్నికల ప్రచారం చేస్తున్నారు. అజితారావు కూడా తనకు అన్యాయం చేసిన పచ్చ నేతలకు నియోజకవర్గంలో అడ్రస్ లేకుండా చేయాలనే లక్ష్యంతో అడుగులు వేస్తున్నారు.



దద్దాల నారాయణ యాదవ్‌కు పార్టీ బీఫాం అందజేస్తున్న చెవిరెడ్డి భాస్కరరెడ్డి

మనమంతా జగనన్న సైనికులం

- జగనన్నను సీఎం చేయడమే లక్ష్యం
- కార్యకర్తకు ఏ ఇబ్బంది వచ్చినా అండగా ఉంటా
- వైఎస్సార్ సీపీ ఒంగోలు ఎంపీ అభ్యర్థి చెవిరెడ్డి భాస్కరరెడ్డి

కనిగిరి రూరల్: 'మనమంతా జగనన్న సైనికులం. మూడు పార్టీలు కలిసి ఆయనపై దాడి చేస్తున్నాయి. ఆయనకు మనమంతా అండగా నిలబడి మరోసారి ముఖ్యమంత్రిని చేసుకోవాల్సిన అవసరం ఉంద'ని వైఎస్సార్ సీపీ ఒంగోలు ఎంపీ అభ్యర్థి చెవిరెడ్డి భాస్కరరెడ్డి అన్నారు. స్థానిక పార్టీ కార్యాలయంలో వైఎస్సార్ సీపీ కనిగిరి అభ్యర్థి దద్దాల నారాయణకు పార్టీ బీఫాంను ఆయన అందజేశారు. ఈ సందర్భంగా చెవిరెడ్డి భాస్కర్‌రెడ్డి మాట్లాడుతూ పార్టీ కుటుంబం లాంటిదని, చిన్న చిన్న సమస్యలు ఉంటాయని వాటిని వదిలేసి పార్టీ గెలుపు కోసం సమష్టిగా పనిచేయాలని పిలుపునిచ్చారు. సీఎం వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి ప్రకటించిన పార్టీ ఎమ్మెల్యే అభ్యర్థి దద్దాల నారాయణను అత్యధిక మెజార్టీతో గెలిపించాల్సిన బాధ్యత మనందరిపై ఉందన్నారు. చిన్న చిన్న మనస్పర్థలు ఉంటే వాటిని పట్టించుకోకుండా సమన్వయంగా పనిచేయాలని పిలుపునిచ్చారు. ఇవి మన నాయకుడిని ముఖ్యమంత్రిని చేసుకునే ఎన్నికలని.. అందరూ జగనన్నను సీఎం చేయడమే లక్ష్యంగా పనిచేయాలని కోరారు.

కార్యకర్తకు ఏ ఇబ్బంది వచ్చినా అండగా ఉంటా

నేను మీలో ఒకడినని... కార్యకర్తకు ఏ కష్టం వచ్చినా అండగా ఉంటానని చెవిరెడ్డి భరోసా ఇచ్చారు. ప్రజాప్రతినిధులు, నాయకులు, కార్యకర్తలు అందరూ సమష్టి ప్రణాళికతో పనిచేయాలన్నారు. కార్యక్రమంలో పీడీసీసీబీ చైర్మన్ వైఎం ప్రసాద్‌రెడ్డి, మున్సిపల్ చైర్మన్ ఎస్కే అబ్దుల్ గఫార్, ఏఎంసీ చైర్మన్ చింతంగుంట్ల సాల్మన్ రాజు, ఎంపీపీ ప్రకాశం, జెడ్పీటీసీ కస్తూరిరెడ్డి, ఏఎంసీ వైస్ చైర్మన్ ఎస్కే చాంద్ బాషా(బుజ్జి), వాసవీసత్ర సముదాయాల అధ్యక్షుడు దేవకి వెంకటేశ్వర్లు, మాదాల సుబ్బారావు, పార్టీ రాష్ట్ర కార్యదర్శులు డాక్టర్ పెరుగ మురళీకృష్ణ, బసిరెడ్డి పిచ్చిరెడ్డి, ఎస్కే జిలాని, సిరుప గోవర్ధన్‌రెడ్డి, గంగసాని హుసేన్‌రెడ్డి, ఓమోగా రామిరెడ్డి, సిద్ధమూర్తి నారాయణరెడ్డి, యాదాల సాయి, అంబటి కొండారెడ్డి, వైస్ చైర్మన్ ఆర్ మాణిక్యరావు, లింకన్, ఖాజా, మీరావలి, కంటు గురవయ్య, చింతంగుంట్ల కిషోర్, కౌన్సిలర్లు, సర్పంచ్‌లు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఒంగోలు ఎంపీ అభ్యర్థి చెవిరెడ్డి భాస్కరరెడ్డి

ఏ ఆపద వచ్చినా అండగా ఉంటా



టీడీపీ నుంచి వైఎస్సార్ సీపీలో చేరిన ఈతముక్కల చేనేత కుటుంబాలకు కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానిస్తున్న బాలినేని శ్రీనివాసరెడ్డి

ఒంగోలు సబర్బన్: ఎవరికి ఏ ఆపద వచ్చినా వాసన్న ఉన్నాడన్న సంగతి మరిచిపోవద్దని ఒంగోలు ఎమ్మెల్యే బాలినేని శ్రీనివాసరెడ్డి భరోసా ఇచ్చారు. కొత్తపట్నం మండలం ఈతముక్కల నుంచి టీడీపీ, జనసేన నుంచి వైఎస్సార్‌సీపీలో చేరేందుకు వందలాది మంది శనివారం బాలినేని నివాసానికి వచ్చారు. బాలినేని మాట్లాడుతూ వైఎస్సార్ సీపీ ప్రభుత్వం ఎల్లవేళలా చేనేతలకు అండగా ఉందని, టీడీపీ సానుభూతిపరులైనా ప్రభుత్వం నుంచి చేనేతలకు అందాల్సిన సంక్షేమ పథకాలను అందేలా చేశానన్నారు. ఈతముక్కలలోని 100 చేనేత కుటుంబాలకు ప్రభుత్వం కరోనా సమయంలో అందించిన ఆర్థిక సాయాన్ని పార్టీలకతీతంగా అందేలా చూశానని తెలిపారు. ఆ అభిమానంతో 150 కుటుంబాలకు చెందిన చేనేతలు టీడీపీని వీడి వైఎస్సార్ సీపీలో చేరేందుకు రావడం మంచి పరిణామమన్నారు. ఈతముక్కలలో గత ఎన్నికల్లో 1100 ఓట్ల మెజార్టీ వచ్చిందని, ఈ ఎన్నికల్లో అంతకు మించి మెజారిటీ రావాలని గ్రామస్తులకు బాలినేని చెప్పారు. కొత్తపట్నం మండలం ఈతముక్కల గ్రామానికి చెందిన చేనేతలతో పాటు నగరంలోని 16వ డివిజన్‌కు చెందిన టీడీపీ, జనసేన పార్టీలకు చెందిన వారు బాలినేని సమక్షంలో వైఎస్సార్ సీపీలో చేరారు. వైఎస్సార్ సీపీ బీసీ సెల్ జిల్లా అధ్యక్షుడు గోలి తిరుపతిరావు, బండారు వెంకటాద్రి ఆధ్వర్యంలో టీడీపీకి చెందిన ముఖ్యనాయకులు అనుమల సుమన్, బండారు జగదీష్, తుమ్మా వెంకటేష్, బద్రి, రామాంజనేయులు నేతృత్వంలో వైఎస్సార్ సీపీలో చేరారు. 16వ డివిజన్‌కు చెందిన జనసేన అధ్యక్షుడు కర్రి వాసు ఆధ్వర్యంలో కంద్రిక శ్రీను, అల్లం కిరణ్‌కుమార్, శీలం సాయికుమార్, కర్రీ మణి, కంద్రిక చెంచురామయ్య, సురేష్, పిచ్చయ్య, గంటా రాముతో పాటు 100 మందికి పైగా జనసేన కార్యకర్తలు, నాయకులు పార్టీలో చేరారు. ఎంపీటీసీ బండారు రుక్మిణమ్మ, ఒంగోలు నగర కన్వీనర్ కఠారి శంకర్‌తో పాటు పలువురు వైఎస్సార్‌సీపీ నాయకులు పాల్గొన్నారు.

150 మంది వలంటీర్లు రాజీనామా..

నగరంలోని 28, 29, 30, 34, 35 డివిజన్లకు చెందిన 150 మంది రాజీనామాలు చేశారు. రాజీనామాల అనంతరం వారంతా బాలినేనిని కలిశారు. బాలినేని మాట్లాడుతూ వలంటీర్లను టీడీపీ అభ్యర్థి దామచర్ల బెదిరిస్తున్నాడని, ఆయన బెదిరింపులకు ఎవ్వరూ భయపడవద్దన్నారు. ముఖ్యమంత్రిగా వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి మళ్లీ బాధ్యతలు స్వీకరించగానే మొదటి సంతకం వలంటీర్ల నియామకంపైనే పెడతారని భరోసా ఇచ్చారు.

వివాహేతర సంబంధమే శాపం?

- పురుగుమందు తాగి ఇద్దరు ఆత్మహత్య



మృతదేహాలను పరిశీలిస్తున్న సీఐ వెంకటేశ్వర్లు, ఎస్సై నాయక్

మార్కాపురం రూరల్: మండలంలోని కోమటికుంట సమీపంలో పురుగుమందు తాగి ఇద్దరు ఆత్మహత్యకు పాల్పడిన సంఘటన శనివారం వెలుగులోనికి వచ్చింది. రూరల్ ఎస్సై వెంకటేశ్వరనాయక్ వివరాల ప్రకారం.. పెద్దారవీడు మండలం పుచ్చకాయల పల్లి గ్రామానికి చెందిన పోతిరెడ్డి సత్యనారాయణ రెడ్డి (25) కమ్మసాని విజయలక్ష్మి (35)కి కొన్ని సంవత్సరాలుగా పరిచయం ఉంది. ఈ క్రమంలో ఈనెల 5న పుచ్చకాయలపల్లి గ్రామం నుంచి కనబడకుండా వెళ్లారని విజయలక్ష్మి భర్త పోలిరెడ్డి పెద్దారవీడు పోలీసుస్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు. కాగా కోమటికుంట వద్ద శనివారం ఉదయం రెండు మృతదేహాలు కనిపించడంతో సంఘటనా స్థలానికి పోలీసులు వెళ్లి పరిశీలించి సత్యనారాయణరెడ్డి, విజయలక్ష్మిగా గుర్తించారు. వివాహేతర సంబంధంతో తలెత్తిన ఒత్తిడి వల్లే వీరి ఆత్మహత్యకు కారణమని పోలీసులు అనుమానం వ్యక్తం చేస్తున్నారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. సంఘటనా స్థలాన్ని సీఐ అవుల వెంకటేశ్వర్లు, రూరల్ ఎస్సై వెంకటేశ్వరనాయక్, పెద్దారవీడు ఎస్సై సైదులు పరిశీలించారు. మృతదేహాలను పోస్టుమార్టం నిమిత్తం జిల్లా వైద్యశాలకు తరలించారు. మృతురాలు విజయలక్ష్మికి భర్త, కుమార్తె, కుమారుడు ఉన్నారు. కాగా విషయం తెలుసుకున్న మృతుల బంధువులు, గ్రామస్తులు అక్కడికి చేరుకున్నారు.

ప్రేమజంట బలవన్మరణం

- పెళ్లి ఇష్టం లేక ప్రియుడితో కలిసి ఆత్మహత్య



గోపి, నాగేశ్వరి మృతదేహాలు

మార్కాపురం రూరల్: మరికొద్ది గంటల్లో ఆ ఇంట్లో పెళ్లిబాజాలు మోగనున్నాయి. ఇంతలోనే తనకు ఇష్టంలేని వివాహం చేస్తున్నారన్న కారణంతో ఇంట్లో నుంచి వెళ్లిపోయిన యువతి ప్రియుడితో కలిసి పురుగుమందు తాగింది. దీంతో ఇద్దరూ మృతిచెందారు. ఈ విషాదకర ఘటన మార్కాపురం మండలం గజ్జలకొండ పంచాయతీ పిచ్చిగుంటపల్లి గ్రామంలో శనివారం రాత్రి జరిగింది. పోలీసులు, గ్రామస్తుల కథనం మేరకు.. గ్రామానికి చెందిన వాటర్ ట్యాంకర్ డ్రైవర్‌గా పనిచేస్తున్న జక్కుల గోపి (23), అదే గ్రామానికి చెందిన నారు వెంకట నాగేశ్వరి (19) ప్రేమించుకున్నారు. ఇద్దరూ వేర్వేరు సామాజికవర్గాలకు చెందినవారు. ఈ క్రమంలో నాగేశ్వరికి ఇళ్లచెరువుకు చెందిన వ్యక్తితో వివాహం చేసేందుకు ఆమె తల్లిదండ్రులు నిశ్చయించారు. ఆదివారం పెళ్లి జరగాల్సి ఉంది. ఈ నేపథ్యంలో తనకు ఇష్టంలేని పెళ్లి చేస్తున్నారని శనివారం ఉదయం నాగేశ్వరి, గోపి ఇళ్లలో నుంచి వెళ్లిపోయి పురుగులమందు తాగి బలవన్మరణానికి పాల్పడ్డారు. తల్లిదండ్రులు ఇరువురి కోసం వెతుకుతుండగా గ్రామ శివార్లలో శనివారం రాత్రి వారి మృతదేహాలు కనిపించాయి. పెళ్లిపీటలు ఎక్కాల్సిన తమ కుమార్తె విగత జీవిగా కనిపించడంతో తల్లిదండ్రులు కన్నీరు మున్నీరుగా విలపించారు. సంఘటనా స్థలాన్ని మార్కాపురం రూరల్ ఎస్సై వెంకటేశ్వర నాయక్ సందర్శించి దర్యాప్తు చేపట్టారు.

వైఎస్సార్ సీపీలోకి 25 కుటుంబాలు చేరిక



పార్టీలోకి ఆహ్వానిస్తున్న దద్దాల నారాయణ యాదవ్

కనిగిరి రూరల్: మండలంలోని చిన ఇర్లపాడుకు చెందిన 25 కుటుంబాలు ఆవుల భాస్కర్‌రెడ్డి, సర్పంచ్ దానమ్మ, ముద్దా బాబు, సంగు వెంకటేశ్వరరెడ్డి, సంగు కృష్ణారెడ్డి ఆధ్వర్యంలో వైఎస్సార్ సీపీలో శనివారం చేరారు. వీరికి డాక్టర్ దద్దాల నారాయణ యాదవ్ కండువా వేసి పార్టీలోకి ఆహ్వానించారు. అనంతరం స్థానిక పార్టీ కార్యాలయంలో ఆవుల భాస్కర్‌రెడ్డి, ముద్దా బాబుల అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో దద్దాల నారాయణ మాట్లాడుతూ వైఎస్సార్ సీపీ హయాంలోనే అన్ని వర్గాల అభివృద్ధి జరిగిందన్నారు. పార్టీలో చేరిన వారిలో ముద్దా ప్రకాష్, రవి, రూబేను, నేలపాటి చంటి, పెద్ద బాబు, సాల్మన్, జోసఫ్, ముద్దా ఎబినేజర్, ఏసయ్య, శేఖర్, రాజు, కిషోర్, జయరావు, కృష్ణాఫర్, ఆనోక్, నోహోక్, ప్రసంగి, షాలీమ్ కుట్టి, ఆనోష్, మాసోక్‌లతో పాటు మరి కొందరున్నారు. పీడీసీసీబీ చైర్మన్ వైఎం ప్రసాద్‌రెడ్డి, ఏఎంసీ చైర్మన్ సాల్మన్‌రాజు, మున్సిపల్ చైర్మన్ అబ్దుల్ గఫార్, జెడ్పీటీసీ మడతల కస్తూరిరెడ్డి పాల్గొన్నారు.

గడప గడపకు సంక్షేమ ఫలాలు

- వైఎస్సార్ సీపీ యర్రగొండపాలెం అభ్యర్థి తాటిపర్తి చంద్రశేఖర్



ఎన్నికల ప్రచారంలో తాటిపర్తి కుటుంబ సభ్యులకు ఆహ్వానం పలుకుతున్న గ్రామస్తులు

యర్రగొండపాలెం: పేదల గడప వద్దకు ప్రభుత్వ సంక్షేమ పథకాలను చేరవేసిన ఘనత ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికే దక్కుతుందని వైఎస్సార్ సీపీ అభ్యర్థి తాటిపర్తి చంద్రశేఖర్ అన్నారు. పట్టణంలోని స్టేట్ బ్యాంక్ వీధి, పాత టెలిఫోన్ ఎక్చ్సేంజ్ కార్యాలయం వీధి, సిద్ధార్థ స్కూల్ బజార్, దిలావర్ వారివీధి, పాత రిజిస్ట్రేషన్ వీధి, ఆసిఫ్ నగర్, చింతపల్లి వారివీధి, పుల్లమ్మ చేను, పెద్ద మసీదు ప్రాంతాల్లో శనివారం ఎన్నికల ప్రచారం నిర్వహించారు. నవరత్నాల పథకాలతో ప్రతి ఇంటికి సంక్షేమ వలంటీర్‌వ్యవస్థ ద్వారా ప్రతి నెలా ఒకటో తేదీ వేకువజామునే ఇంటి వద్దే పింఛన్ అందుతోందని, ఇలాంటి వ్యవస్థ ఎక్కడా లేదన్నారు. గత టీడీపీ హయాంలో చంద్రబాబు, టీడీపీ నేతలు రాష్ట్రాన్ని దోచుకుతిన్నారు తప్ప ప్రజల సంక్షేమాన్ని పట్టించుకోలేదన్నారు. సంక్షేమ పథకాలు సజావుగా కొనసాగాలంటే జగనన్నను తిరిగి ముఖ్యమంత్రిగా చేసుకోవాల్సిన అవసరం తమ అందరిపై ఉందని ఆయన అన్నారు. ఎమ్మెల్యేగా తనను, ఎంపీగా చెవిరెడ్డి భాస్కర్‌రెడ్డిలను అత్యధిక మెజారిటీతో గెలిపించాలని కోరారు. ఎన్నికల ప్రచారంలో అభ్యర్థి తాటిపర్తి సతీమణి భాగ్యసీమ చౌదరి, తనయురాలు అకాంక్ష, సర్పంచ్ ఆర్.అరుణాబాయి, ఎంపీపీ దొంతా కిరణ్‌గౌడ్, జెడ్పీటీసీ చేదూరి విజయభాస్కర్, పార్టీ మండల అధ్యక్షుడు కె.ఓబులరెడ్డి, జిల్లా పరిషత్ కో ఆప్షన్ సభ్యుడు సయ్యద్ షాబీర్‌బాష, సచివాలయాల మండల కన్వీనర్ సయ్యద్ జబీవుల్లా, నాయకులు ఎస్.వెంకటరెడ్డి, సూరె రమేష్, కందూరి గురుప్రసాద్, పాల్గొన్నారు.

పేదల వైద్య సేవే లక్ష్యం

- ఉచిత మెగా మెడికల్ క్యాంప్‌నకు విశేష స్పందన



పేషెంట్లకు ఉచితంగా మందులు పంపిణీ చేస్తున్న డాక్టర్ మల్లిఖార్జున రెడ్డి

పామూరు: మారుమూల ప్రాంతాల్లో పేదలకు మెరుగైన ఉచిత వైద్యసేవలు అందించడమే రవణమ్మ మెమోరియల్ మల్లిఖార్జునరెడ్డి మల్టీ స్పెషాలిటీ హాస్పిటల్ లక్ష్యమని డాక్టర్ మల్లిఖార్జునరెడ్డి అన్నారు. పామూరులో శనివారం నిర్వహించిన ఉచిత మెగా మెడికల్ క్యాంప్‌నకు విశేష స్పందన లభించింది. పామూరుతో పాటు సీఎస్‌పురం, నెల్లూరు జిల్లా వరికుంటపాడు మండలాల నుంచి 672 మంది వైద్య పరీక్షలు చేయించుకున్నారు. వైద్యశిబిరాన్ని ప్రారంభించిన అనంతరం డాక్టర్ పి.మల్లిఖార్జున రెడ్డి మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ సంపూర్ణ ఆరోగ్యంతో ఉండాలనే లక్ష్యంతో మెడికల్ క్యాంపుతో పేదలకు వైద్యసేవలు అందిస్తున్నట్లు తెలిపారు. ఆదివారం కూడా వైద్యశిబిరం నిర్వహిస్తామని, ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. డాక్టర్ షేక్ షంషుద్దీన్, డాక్టర్ వై.శ్రీనివాసులు ఎముకలు, కీళ్లు, నరాలు, మెడ, కీళ్ల నొప్పులు, బీపీ, షుగర్ సంబంధిత వ్యాధులకు ఉచితంగా పరీక్షలు నిర్వహించి అవసరమైన వారికి ఉచితంగా మందులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో వైద్య సిబ్బంది పాల్గొన్నారు.